PRGI REGN NO: APTEL/26/A3695

నేటి మినిట్ టు మినిట్

తెలుగు దిన పత్రిక

NETI MINUTE TO MINUTE


TELUGU DAILY

సంపుటి: 01 సంచిక :134 ఎడిషన్ : అనంతపురము మరియు సత్యసాయి జిల్లా, తేది : గురువారం - 29 అక్టోబర్ 2026, పేజీలు -4 వెల 1/-

VOLUME:01 ISSUE:134 EDITION: ANANTHAPURAMU, SATHYA SAI DIST. DATE: THURSDAY 29 OCTOBER 2026 PAGES: 04 RS:01/

కేంద్ర ఉద్యోగులకు
3 శాతం డీఏ పెంపు

48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి



న్యూఢిల్లీ,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...

ఆర్నబ్ తుఫాన్ బాధితులకు చంద్రబాబు
భారీ ఊరట!

● రైతులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు పరిహారం ● మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు.. పంట నష్టానికి హెక్టారుకు రూ.15 వేల నుంచి రూ.75 వేల వరకు సాయం



అమరావతి,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆర్నబ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిహార ప్యాకేజీని ప్రకటించింది. పంటలు, ఇళ్లు, దుకాణాలు, పశువులు, ఆస్తులు నష్టపోయిన బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి ఆయన మీడియాతో మాట్లాడుతూ, బాధితులకు త్వరితగతిన సహాయం అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. **మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం** తుఫాన్ కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నారు. మిగతా2లో...

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధారణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

ఏపీలో పరిషత్ ఎన్నికలు
వాయిదా!

● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్

● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు



అమరావతి,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

తుఫాన్ బాధితులకు అండగా
నిలవండి!

- జనసేన శ్రేణులకు పవన్ కల్యాణ్ పిలుపు



అమరావతి,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆర్నబ్ ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తుఫాన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు భరోసా కల్పిస్తూ, సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. మిగతా2లో...

తుఫాన్ బాధితులకు
పూర్తి అండగా ఉంటాం!

సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేశాం: హోంమంత్రి అనిత

కోనసీమలో విద్యుత్ స్తంభాలు, పంటలకు భారీ నష్టం



అంబేడ్కర్ కోనసీమ జిల్లా,28(నేటి మినిట్ టు మినిట్): ఆర్నబ్ తుఫాన్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షణలో సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసినట్లు తెలిపారు. బుధవారం అమలాపురంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆమె, అనంతరం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. **విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు** తుఫాన్ ప్రభావంతో కోనసీమ జిల్లాలో సగటున 94 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని హోంమంత్రి తెలిపారు. బలమైన గాలుల కారణంగా సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో గురువారం సాయంత్రానికి, గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయానికి విద్యుత్ సరఫరాను మిగతా2లో...



మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

హైదరాబాద్,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

రాష్ట్రంలో ఎమర్జెన్సీ
తరహా పాలన!

సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన

ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, 28(నేటి మినిట్ టు మినిట్): మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తిక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

ఆర్నబ్ తుఫాన్ బాధితులకు చంద్రబాబు భారీ ఊరట!

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లలోకి వరద నీరు చేరిన కుటుంబాలకు 25 కిలోల బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన వారికి ఒక్కొక్కరికి రూ.1,000 ఆర్థిక సాయం అందించనున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు, దెబ్బతిన్న దుకాణాలకు రూ.25 వేల చొప్పున సాయం ప్రకటించారు. **రైతులకు పంట నష్ట పరిహారం** తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం అంచనా వేసి పరిహారం అందించనున్నారు. పలు పంటలకు హెక్టారుకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు సాయం ఇవ్వనున్నారు. అరటి, పసుపు, మామిడి, నిమ్మ, దానిమ్మ, సపోటా, జీడిమామిడి, కాఫీ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలకు హెక్టారుకు రూ.35 వేల పరిహారం ప్రకటించారు. తమలపాకుల తోటలకు హెక్టారుకు రూ.75 వేలు, మిరప, బొప్పాయి, టమాటా, ఉల్లి పంటలకు హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు సాయం అందించనున్నారు. పత్తి, చెరకు పంటలకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం తెలిపారు. **మత్స్యకారులు, చేనేత కార్మికులకు అండ** దెబ్బతిన్న చేపల వలల మరమ్మతులకు రూ.5 వేలు, కొత్త వలల కొనుగోలుకు రూ.10 వేలు సాయం అందించనున్నారు. వలలతో సహా పూర్తిగా దెబ్బతిన్న మోటారు లేని పడవలకు రూ.27 వేలు, ఫిషింగ్ బోట్లకు రూ.25 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. చేపల చెరువుల పునరుద్ధరణకు రూ.17 వేలు, దెబ్బతిన్న షెడ్లకు రూ.25 వేల సాయం ఇవ్వనున్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యంతో పాటు ఉల్లిపాయలు, వంటనూనె, కందిపప్పు పంపిణీ చేయనున్నారు. **పశుసంపద, ఇతర పృత్తులకు పరిహారం** తుఫాన్‌లో ఆవు మృతి చెందితే రూ.50 వేలు, గేదెకు రూ.40 వేలు, దూడకు రూ.25 వేలు, గొర్రె లేదా మేకకు రూ.7,500 పరిహారం అందించనున్నారు. కోళ్లు మృతి చెందితే ఒక్కో కోడికి రూ.100 చొప్పున, ఒక్కో లబ్ధిదారుకు గరిష్ఠంగా రూ.10 వేల వరకు సాయం ఇవ్వనున్నారు. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు రూ.3 వేలు, త్రిచక్ర వాహనాలకు రూ.10 వేలు, తోపుడు బండ్లకు రూ.20 వేల చొప్పున సహాయం ప్రకటించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా నష్టాన్ని బట్టి ఆర్థిక సాయం అందించనున్నారు. **నష్టాల అంచనా తర్వాత రైతులకు సాయం** తుఫాన్ నష్టంపై కేంద్రానికి లేఖ రాసినట్లు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి పరిస్థితిని వివరించినట్లు చంద్రబాబు తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసిన తర్వాత రైతులకు పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. పంటల నష్టాన్ని మినహాయించి ఇతర విభాగాల బాధితులకు గురువారం నుంచి ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిహారం పంపిణీలో పారదర్శకత పాటించాలని, బాధితులకు వేగంగా సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

తుఫాన్ బాధితులకు పూర్తి అండగా ఉంటాం!

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అమలాపురం మున్సిపాలిటీలో సుమారు 1,400 చెట్లు నేలకొరిగాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. **రైతులు, మత్స్యకారులను ఆదుకుంటాం** తుఫాన్ ప్రభావంతో సుమారు 1.18 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు అనిత తెలిపారు. కొబ్బరి, అరటి తోటలకు కూడా భారీ నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని గురువారం నుంచి అంచనా వేయనున్నట్లు వెల్లడించారు. ఉప్పాడతో పాటు తీర ప్రాంతాల్లో సుమారు 450 మత్స్యకార పడవలు దెబ్బతిన్నట్లు అంచనా వేశామని తెలిపారు.

నష్టపోయిన రైతులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. **సమన్వయంతో పనిచేయాలి** విద్యుత్, పురపాలక, పంచాయతీరాజ్, మత్స్యశాఖ అధికారుల తో హోంమంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో సహాయక చర్యలు చేపడుతు న్నట్లు తెలిపారు. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సహాయక చర్యలకు సహకరించాలని హోంమంత్రి అనిత కోరారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

(మొదటి పేజీ తరువాయి)

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి**

మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు .**ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- **జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ**
- **వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు**



హైదరాబాద్:అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు.హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు.మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.



నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్:అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.**కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం.**తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

తుఫాన్ బాధితులకు అండగా నిలవండి!

(మొదటి పేజీ తరువాయి)

తుఫాన్ కారణంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులకు ఆహారం, ఇతర నిత్యావసర సదుపాయాలు అందేలా చూడాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యల్లో జనసేన కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అధికారులు, సహాయక సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ బాధితులకు వీలైనంత త్వరగా సాయం అందేలా కృషి చేయాలని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చోట సహాయక చర్యలకు తోడ్పడాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.**దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఆర్నబ్ తుఫాన్ ప్రభావం.. నేడు మూడు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు

- పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటన



అమరావతి,అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు జిల్లాల్లో గురువారం (అక్టోబరు 29) విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. **రాజమహేంద్రవరంలో..** రాజమహేంద్రవరంలో పాఠశాలలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం సెలవు ప్రకటించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకు కూడా సెలవు వర్తించనుంది. **విశాఖపట్నంలో..**తుఫాన్ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం కూడా సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ తెలిపారు. అదేవిధంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు నగర పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. **ఏలూరు జిల్లాలో..**వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.తుఫాన్ ప్రభావం నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత జిల్లా అధికారుల సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

సిద్ధవటం మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం

● జనసేనకు 2,టీడీపీకి 6,వైకాపాకు ఒక స్థానం



సిద్ధవటం అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): సిద్ధవటం మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు గాను తొమ్మిది స్థానాలు ఏకగ్రీవమయ్యాయని ఆర్డీవో కృష్ణయ్య వెల్లడించారు. వీటిలో జనసేనకు రెండు, టీడీపీకి ఆరు, వైకాపాకు ఒక స్థానం దక్కాయి. మిగిలిన రెండు స్థానాలకు పోటీ జరగనుంది. జనసేన తరఫున సిద్ధవటం నుంచి అతికారి వినుత, మాధవరం-1 నుంచి చింతగింజల సుభాషిణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ తరఫున జంగాలపల్లె నుంచి పాలెం వెంకటమ్మ, బొగ్గడివారిపల్లె నుంచి కొమ్మూరి పెంచలమ్మ, ఉప్పరపల్లె నుంచి సామా శ్రీనివాసులు, పెద్దపల్లె నుంచి కాడే చిన్నక్క, మాచుపల్లె నుంచి కోటపాటి మధు, వంతాటిపల్లె నుంచి బూసి చిన్న సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. వైకాపా తరఫున మాధవరం-2 నుంచి శ్రీరామదాసు లలిత ఏకగ్రీవమయ్యారు. పి.కొత్తపల్లె స్థానంలో వైకాపా అభ్యర్థి సౌరి డి. విజయలక్ష్మి, టీడీపీ అభ్యర్థి జ్యోతి శివారెడ్డి పోటీలో ఉండగా, టక్కోలు స్థానంలో స్వతంత్ర అభ్యర్థులు సింగం పద్మావతి, బత్తల లక్ష్మీదేవి పోటీ పడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిద్ధవటం ఎస్ఐ హారిక, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయ కర్త అతికారి కృష్ణ, టీడీపీ మండల ఇన్‌ఛార్జి శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఏపీ పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, అవ్వారు రవిశంకర్, డేరంగుల శ్రీకాంత్, చెంచయ్య నాయుడు, భవనాసి ఓబులయ్య, జనసేన నాయకుడు అతికారి చిన్న వెంకటయ్య, మహబూబ్ బాషా, పసుపులేటి గంగయ్య, ఎన్నారై చలపాటి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన అవసరం



కర్నూలు అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ విధానాలపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ పెట్టెల నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించి, ఎన్నికల విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థనా మందిరాల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించే వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత ఎన్నికల ప్రచారానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేయర్ స్థాన రిటర్నింగ్ అధికారి, సెట్కూరు ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్, అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి

పత్తికొండ అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్):
పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్చార్జి జడ్జి ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి కట్టా హేమ ఆకస్మికతనికి నిర్వహించారు. బుధవారం సాయంత్రం సబ్ జైలులో ముద్దాయిల కేసుల వివరాలు,ఎన్ని రోజులుగా శిక్ష అనుభవిస్తున్నారు, న్యాయవాది ఉన్నాడా లేదా అనే విషయాలపై ముద్దాయిలని అడిగి వివరాలు తెలుసుకున్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసే సౌకర్యం న్యాయ సేవ అధికార సంస్థ కల్పిస్తుంది అన్నారు. అనంతరం సబ్ జైలులో ముద్దాయిలు అందిస్తున్న ఆహారం,వారి వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పానల్ న్యాయవాదులు నగేష్, సూరజ్ నబి, లోకదాలత్ క్లర్క్ రాఘవేంద్ర, జైలు సిబ్బంది పెద్దన్న, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.



భక్తి, సంస్కృతి, ఐక్యతతో మూడు ప్రపంచ రికార్డులే లక్ష్యం

రొంపిచర్ల అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఆఫ్రికా ఖండంలోని ఉగాండా రాజధాని కాంపాలాలో భక్తి, ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, సామూహిక ఐక్యతను చాటిచెప్పేలా మూడు ప్రపంచ రికార్డుల సాధనకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఉగాండా లిమిటెడ్ ఆధ్వర్యంలో కాంపాలాలోని ఒమోండి మైదానంలో శ్రీ బాలాజీ స్వామికి అంకితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమ నిర్వహణలో చిత్తూరు జిల్లా రొంపిచర్లకు చెందిన ప్రవాస భారతీయులు జి.సి. శేఖర్ గుప్తా, లావణ్య గోగులపాటి దంపతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వారు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ స్వామి వేషధారణలో అత్యధిక మంది ఒకేచోట సమావేశం కావడం, భక్తులతో భారీ మానవ తిలక ఆకృతిని రూపొందించడం, ఒకేసారి అత్యధిక మంది భక్తులు సమన్వయంతో శ్రీ బాలాజీ మంత్రాన్ని సామూహికంగా



జపించడం వంటి మూడు ప్రపంచ రికార్డుల సాధనకు ప్రయత్నించనున్నారు. సంప్రదాయ దుస్తుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక నామస్మరణ చేయడం ద్వారా భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.ఉగాండాలో శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తి కార్యక్రమాల నిర్వహణతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అక్కడి భారతీయ సమాజానికి, ముఖ్యంగా యువతకు పరిచయం చేయడంలో శేఖర్ గుప్తా, లావణ్య దంపతులు చొరవ చూపుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాస భారతీయులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు భక్తి, సాంస్కృతిక వారసత్వం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు.కాంపాలాలోని ఒమోండి మైదానంలో జరగనున్న ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, భారతీయ సమాజ ప్రతినిధులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ బాలాజీ స్వామి ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం భక్తులం దరినీ ఒకే కుటుంబంగా కలిపే ఆధ్యాత్మిక వేదికగా నిలుస్తుందని శేఖర్ గుప్తా, లావణ్య దంపతులు తెలిపారు. భక్తి, భారతీయ సంస్కృతి, ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పే ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

సీపీఐ ఎంపీటీసీ,వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థుల తరపున ప్రచారం

పత్తికొండ అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): పత్తికొండ మండలంలోని పులికొండ గ్రామం, పట్టణంలోని సవారమ్మ కాలనీలో సీపీఐ, వైసీపీ నాయకులు మంగళవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రచారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను కలిసి అభ్యర్థించారు. పులికొండలోని రంగనాథస్వామి ఆలయంలో జడ్పీటీసీ అభ్యర్థి శ్రీరంగడు, సీపీఐ, వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రజా



సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేపడుతున్న సీపీఐ అభ్యర్థులు ఆరో ఎంపీటీసీ స్థానానికి నెట్టికంటయ్య, ఏడో ఎంపీటీసీ స్థానానికి వాకిటి కవిత పోటీ చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి వారిని గెలిపించాలని కోరారు. అలాగే వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి శ్రీరంగడుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మద్దతు ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. రాజాసాహెబ్, మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు కారన్న, సిద్ధలిం గప్ప, శాఖ కార్యదర్శి నాగేంద్రయ్య, మహిళా సంఘం నాయకురాలు పార్వతి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె శ్రీ చైతన్య విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ స్కాలర్‌షిప్‌లు

వేంపల్లె 28(నేటి మినిట్ టు మినిట్): వేంపల్లి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల చెందిన ఐదుగురు విద్యార్థులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకానికి ఎంపికయ్యారు. విద్యార్థుల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో అందిస్తున్న ఈ స్కాలర్‌షిప్‌కు ఐదుగురు విద్యార్థులు అర్హత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ పథకం ద్వారా అర్హులైన ఐదుగురు విద్యార్థులకు 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ 4,000 చొప్పున స్కాలర్‌షిప్ అందించబడుతుంది. రవాణా రంగంలో పనిచేస్తు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారి పిల్లలకు విద్యలో ఆర్థిక ప్రోత్సాహం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. శ్రీరామ్ ఫైనాన్స్ సీనియర్ బిజినెస్ మేనేజర్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి



ఇలాంటి స్కాలర్‌షిప్ పథకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారి చదువుకు తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలు అభినందనీయమన్నారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన ఐదుగురు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

పులివెందులలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

- కూటమిది చేతల ప్రభుత్వం.. వైకాపాది మాటల ప్రభుత్వం: బీటెక్ రవి

పులివెందుల అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): పులివెందులలో దశాబ్దాల కుటుంబ పాలనకు స్వస్తి పలికి, కూటమికి ఒక్క అవకాశం ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా పూల అంగళ్ల సర్కిల్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైకాపా పాలనలో అక్రమ వసూళ్లు, వేధింపులు జరిగాయని ఆరోపించారు.**వివేకా హత్య కేసులో డ్రామాలు: ఆదినారాయణరెడ్డి** జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ కుటుంబం ప్రజల ముందు అభాసుపాలైందని విమర్శించారు. మాజీ జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి గీతా కుమారితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





బ్యానర్ చూడండి.. ఓటు అడగండి

సాయి ట్రస్ట్ వినూత్న నినాదం

సమస్యలు పరిష్కరించిన వారికే మా ఓటు

నగర అభివృద్ధికి 8 ప్రధాన డిమాండ్లు



అనంతపురం:అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాయి ట్రస్ట్ వినూత్న నినాదంతో ముందుకొచ్చింది. “మేము ఓటు అమ్ముకోము.. రాజకీయ నాయకుల వాగ్దానాలను నమ్ముతాము” అంటూ సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తామని ట్రస్ట్ బృందం స్పష్టం చేసింది. ఈ మేరకు ట్రస్ట్ కార్యాలయం ఎదుట బ్యానర్ ఏర్పాటు చేసింది. 1990లో అప్పటి ఎన్నికల ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సాయి ట్రస్ట్.. 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించింది. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నగరంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ట్రస్ట్ డిమాండ్ చేసింది. **ట్రస్ట్ ప్రధాన డిమాండ్లు ఇవే..** 1. ఏళ్లుగా పేరుకుపోయిన డంపింగ్ యార్డును తొలగించాలి. 2. కొత్త దహనవాటికలు ఏర్పాటు చేసి, ఎలక్ట్రిక్ దహన విధానాన్ని ప్రోత్సహించాలి. ఇప్పటికే ఉన్న వాటి నిర్వహణను కార్పొరేషన్ చేపట్టాలి. 3. పాలు ఇవ్వని గోవుల సంరక్షణకు గోశాల ఏర్పాటు చేయాలి. 4. యాచకులు, నిరాశ్రయుల కోసం నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి. 5. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి. 6. పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కల్పించి, కార్మికుల సంఖ్య పెంచాలి. 7. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి. 8. నగరంలో ప్రజలకు అందుబాటులో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. **హామీలు కాదు.. సమస్యలకు పరిష్కారాలు కావాలి** నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజకీయ నాయకులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సాయి ట్రస్ట్ కోరింది. నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే అభ్యర్థులనే ప్రజలు ఎన్నుకోవాలని పిలుపునిచ్చింది.

గాలివీడు గడ్డపై మళ్లీ పులి గర్జన.!

- **పూలకుంటలో ఎంపీటీసీ పోరుకు సిద్ధమైన పార్వతమ్మ**
- **ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి**



గాలివీడు అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): రాయచోటి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గాలివీడు మండలం పూలకుంటలో ఎంపీటీసీ ఎన్నిక రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న పార్వతమ్మకు మద్దతుగా స్థానికంగా ప్రచారం సాగుతోంది. గడికోట శ్రీకాంత్‌రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో, జగనన్న సంక్షేమ పథకాలు, గతంలో జరిగిన అభివృద్ధిని ప్రస్తావిస్తూ ఆమెకు మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి.రాయచోటి నియోజకవర్గంలోని 67 ఎంపీటీసీ స్థానాల్లో 66 స్థానాలు టీడీపీ ఏకగ్రీవమైన నేపథ్యంలో, పూలకుంటలో ఎన్నిక జరగనుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ స్థానంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగనుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తమ అభ్యర్థి విజయంపై ఆశలు పెట్టుకున్నాయి.పార్వతమ్మను గెలిపించడం ద్వారా మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి బహుమతిగా అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకోవాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్వతమ్మను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజ్ఞప్తి చేస్తున్నాయి. పూలకుంట ఎంపీటీసీ ఎన్నికలో ఫ్యాన్ గుర్తుపై ఓటర్ల తీర్పు ఎలా ఉండనుందనేది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

అనంతపురం జిల్లా కేంద్రంలో పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్

ఎన్నికల వేళ శాంతిభద్రతల

పరిరక్షణకు పటిష్ట చర్యలు

మైన్స్ ప్రూఫ్ వాహనం, వజ్ర,


వాటర్ క్యానన్‌తో పోలీసుల కవాతు

ప్రజల్లో భరోసా నింపడమే లక్ష్యం

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు

వినియోగించుకోవాలి: పోలీసు అధికారులు







అనంతపురం:అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఎన్నికల నేపథ్యంలో నగరంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజల్లో ధైర్యం, భరోసా నింపేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అర్బన్ డీఎస్పీ కరుణాకరరావు, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి నేతృత్వంలో ఈ కవాతు సాగింది.ఈ ఫ్లాగ్ మార్చ్‌లో వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, ట్రాఫిక్ సీఐలతో పాటు ఆర్ఐ అడ్మిన్, భారీ సంఖ్యలో పోలీసు సిబ్బంది, కమాండోలు పాల్గొన్నారు. మైన్స్ ప్రూఫ్ వాహనం, వజ్ర వాహనం, వాటర్ క్యానన్ (జల ఫిరంగి) వంటి అత్యాధునిక రక్షణ వాహనాలను కవాతులో ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందనే సందేశాన్ని ప్రజలకు అందించారు. **ప్రధాన కూడళ్ల మీదుగా కవాతు** సప్తగిరి సర్కిల్‌లో ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ టవర్ క్లాక్, ఆర్ట్స్ కాలేజీ, రైల్వే స్టేషన్, చంద్రా హాస్పిటల్, ఆర్టీసీ బస్టాండ్, నల్లగంటం సర్కిల్, తాడిపత్రి బస్టాండ్, గాంధీ సర్కిల్, తిలక్ రోడ్, ఓల్డ్ టౌన్, సూర్యనగర్ క్రాస్ మీదుగా సాగింది. తిరిగి సప్తగిరి సర్కిల్‌కు చేరుకున్న అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) వద్ద ముగిసింది. **భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి** ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ అమూల్యమైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు పోలీసు శాఖకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నల్లగుట్ట పల్లి ఎంపీటీసీగా బిజెపి తరపున జి.సుబ్బరాయుడు ఏకగ్రీవ ఎన్నిక



రామాపురం అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినటువంటి ఎంపీటీసీ ఎన్నికలలో రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామం బీసీ కాలనీకి చెందిన గంప సుబ్బరాయుడు బిజెపి తరపున ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నల్లగుట్టపల్లె గ్రామ ఎంపీటీసీ గంప సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికలో ఎంపీటీసీ గా పోషించినటువంటి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాన న్నారు. అలాగే నాకు భారతీయ జనతా పార్టీ తరపున బీఫామ్ ఇచ్చినటువంటి రాష్ట్ర నాయకత్వానికి జిల్లా అధ్యక్షులు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అదేవిధంగా నాకు ఎంపీటీసీ టికెట్ కేటాయించడంలో ముఖ్య కారణమైనటువంటి మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కి, శ్రీ మౌర్యా రెడ్డి కి, టిడిపి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి కి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్ది రేవుల రమేష్ రెడ్డి కి, టిడిపి సీనియర్ నాయకులు ఎం ఎల్ వెంకట్రాం రెడ్డి కి, భవనం వెంకట్రామిరెడ్డి కి, పప్పిరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి కి, రాంబసి రెడ్డి కి, చంద్రమౌళి కి,చెన్న కృష్ణా రెడ్డి కి, అన్నయ్య కి, బాబు కి, మునీర్ భాష కి మరియు నాకు ప్రత్యక్షంగా పరోక్షంగా నా ఈ ఎన్నికకు సహకరించినటువంటి నల్లగుట్టపల్లె గ్రామ పెద్దలకు మరియు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రానున్న రోజులలో నల్లగుట్టపల్లె ఎంపీటీసీ పరిధిలో సమస్యల పరిష్కారానికై కృషి చేస్తూ భవిష్యత్తులో గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలతో మమేకమై పనిచేస్తానని, నా ఈ బాధ్యతతో ప్రజలకు సేవ చేసేందుకు రాముడన్న ఇచ్చినటువంటి ఈ అవకాశాన్ని వమ్ము చేయకుండా అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. మరొక మారు నాకు ఈ అవకాశం కల్పించినటువంటి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా టీడీపీలోకి భారీ చేరికలు

- పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి





పులివెందుల అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ప్రజా సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు.బుధవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని నగరిగుట్ట ప్రాంతానికి చెందిన సుమారు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి.నగరిగుట్టకు చెందిన కావేటి కొండప్ప, శ్రీనివాసులు,ఎస్.పెంచలయ్యల ఆధ్వర్యంలో తరలివచ్చిన ఈ కుటుంబాలు,రాష్ట్ర హజ్ & ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో బీటెక్ రవి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.నూతనంగా చేరిన వారికి బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రేణులకు సూచించారు.

అనంతపురంలో ఎన్నికల భద్రతకు పోలీసుల సన్నద్ధం

ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు

జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధం

‘మైన్స్ ప్రూఫ్’ వాహనాన్ని పరిశీలించిన

ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్



అనంతపురం, అక్టోబర్ 28(నేటి మినిట్ టు మినిట్): ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ‘మైన్స్ ప్రూఫ్’ వాహనాన్ని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్ శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోంది. అత్యాధునిక రక్షణ వాహనాలు, అవసరమైన భద్రతా పరికరాలను సిద్ధంగా ఉంచుతూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధమవుతోంది.

M/S SUNIL PUBLICATIONSPrinting Press (Name & Address)PrinterM/S SUNIL PUBLICATIONS D.NO.: 28-5-782,
HOUSING BOARD COLONY, REVENUE WARD NO. 28, ANANTAPUR., ANDHRA PRADESH - 515001.